# విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానముల సమ్మిళిత స్వరూపమే మానవత్వము

**మానవత్వమనగ మనసు మాట క్రియయు**
**అన్ని ఒక్కటిగానె అమరియుండు**
**మనసునందు వేరు మాటయు క్రియయును**
**వేరువేరులైన విలువయేమి?**

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాధికారులారా!

జీవితము చాలా పవిత్రమైనది, విలువైనది, జీవింపతగినది. శరీరము, మనసు, ఆత్మల కలయికయే మానవత్వము. కర్మలు చేయునది దేహము. తెలుసుకొనునది మనసు. వున్నది ఆత్మ. ఈ ఆత్మయే మన హృదయమునందు వున్న దివ్యత్వము. చేయుట, తెలుసుకొనుట, వుండుట అనే త్రివిధశక్తులయొక్క తత్త్వమును వ్యక్తము చేయటమే, మన జీవితము. దీనియొక్క తత్త్వాన్ని మానవుడు అర్థము చేసుకొనటమే మానవత్వముయొక్క తత్త్వము. చేయునది, తెలుసుకొనునది, వుండునది వేరువేరు అయినప్పటికిని యివన్నియు చేరి మానవుని పూర్ణత్వముగా రూపొందింపచేస్తుంది. మనసు వివిధ గతులయందు, వివిధ మార్గములయందు, వివిధ కర్మలను ఆచరించటంచేత దీనినే అంతఃకరణ అనే పేరుతో పిలుస్తూ వచ్చారు. సంకల్పవికల్పములతో కూడటంచేత మనస్సనియు, నిశ్చయాత్మకమనే దీనివల్ల బుద్ధి అనియు (discrimination) చింతన చేయటంవలన చిత్తమనియు, దివ్యత్వమును వ్యక్తీకరింపచేయటంచేత అహంకారమనియు వ్యవహరించడం జరుగుతోంది. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారములయొక్క స్వరూపమే అంతఃకరణ.

srisathyasaivachanamrutam

## మనసు ఎట్టిదో మనిషి అట్టివాడు

మనసు వుండటంచేతనే 'మనిషి' అని పేరు వచ్చింది. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని మనసుయొక్క సంకల్పముచేతనే బంధనము, స్వేచ్ఛ, రెండూ కలుగుతున్నాయి. మనసు యెట్టిదో మనిషి అట్టివాడు. 'యద్భావం తద్భవతి'. దీనినే ఆంగ్లమునందుకూడను so think as the man, so is the man అన్నారు. కనుకనే మానవత్వమనేటువంటిది మనసుద్వారా యేర్పడినది. ఈ అన్నింటికి మూలాధారమైన తత్త్వము ఒకటి కలదు. దానినే 'ప్రజ్ఞ' అని చెప్పుతూ వచ్చారు. ప్రజ్ఞ అనగా వివేకమనియు, తెలివితేటలనియు, మేధస్సనియు అనేక విధములుగా చెప్పుతున్నారు. కానీ, యివి దీనికి సరైన అర్థములుకాదు. ప్రజ్ఞ అనగా కేవలము బ్రహ్మస్థానమే! 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని వేదవాక్యమునందుకూడను చెప్పబడుతూ వచ్చింది. కనుక, ప్రజ్ఞ అనేది శరీరమునందున్న ధాతువునందు, అంతఃకరణయందు, ఆత్మయందు సమత్వముగా వుంటున్నది. ప్రజ్ఞ అనగా constant Integrated awareness. ఈ ప్రజ్ఞ కల్గటమే మానవత్వానికి సరైన విలువ. ఈ ప్రజ్ఞ ప్రేమమయమైనదిగా వుంటుంది. ఇలాంటి ప్రేమమయమైన ప్రజ్ఞనుండి వచ్చిన రీసౌండే (Resound) సత్యము. దీనినే ప్రతిధ్వని అన్నారు. ఈ ప్రేమమయమైన ప్రజ్ఞనుండి వచ్చిన ప్రక్రియయే అనగా కర్మలయొక్క ఆచరణ (Reaction) అన్నారు. ఇదే ధర్మము అని చెప్పబడుతూ వచ్చింది. ఈ Resound, Reactionయొక్క మూలాధారతత్త్వమే Reflection. ఈ Reflection శాంతి. ప్రేమమయమైన ప్రజ్ఞయొక్క Reflection శాంతి. ప్రేమమయమైన రియాక్షనే ధర్మము. ప్రేమమయమైన ప్రజ్ఞయొక్క ప్రతిధ్వనే సత్యము. ఈ సత్యధర్మశాంతిప్రేమలు సరైన రీతిలో అర్థము చేసుకోటమే అహింస. కనుకనే, మానవుడు తనయొక్క ప్రజ్ఞానస్థానమునుండి తన కర్మలు ప్రారంభించాలి.

## త్రికాలాబాధ్యమైన సత్యముయొక్క పేరే ఋతము

సత్యమనగా యేమిటి? చూచినది చూచినట్టుగా, చేసినది చేసినట్టుగా, విన్నది విన్నట్టుగా చెప్పటము సత్యమా? కాదుకాదు. ఈ విధమైన సత్యములు చాలా ప్రమాదములు కొని తెస్తున్నవి. ఇది బాహ్యజగత్తునకు మాత్రమే సత్యమని నిరూపిస్తూవచ్చింది. నిజమైన

sri sathyasaivachanamrutam

సత్యము దేశకాల పాత్రలకు అతీతమైనది. యిట్టి త్రికాలాబాధ్యమైన సత్యాన్ని ఆచరణలో నిరూపించుట చాలా కష్టము. దీనిని వేదాంతము 'ఋతము' అని పేరు పెడుతూ వచ్చింది. ఋతమనగా transendental truth అని. ఈ transendental truth అనేది మానవుని fundamental basis. ఇట్టి సత్యము నాధారముచేసుకొనియే జగత్ సంబంధమైన truthను హృదయపూర్వకముగా మనము ప్రకటితము గావించాలి.

**తలలో విచారించిన దానిని హృదయముతో పరిశీలించి చేతితో క్రియ ప్రారంభించటమే త్రికరణశుద్ధి**

మనసులో అనగా తలలో ఒక విషయాన్ని చింతించిన తక్షణమే చేతితో పని ప్రారంభించకూడదు. హృదయముతో దీనిని పరిశీలన గావించాలి. ఈ thought సరియైనదా కాదా; ఆచరించ తగినదా, ఆచరించతగనిదా అని విచారణ చెయ్యాలి. యీ హృదయమునకు తృప్తి అయినప్పుడే మనము చేతులతో ఆచరించటానికి ప్రయత్నించాలి. ఇదే నిజమైనటువంటి విలువ. అనగా తలతో మనము విచారించినదానిని హృదయముతో పరిశీలన చేసి తదుపరి చేతితో మనము ఆచరించాలి. ఇదియే విద్యయొక్క ప్రధానమైన విలువ. Human Value అన్నారు. EHV అన్నారు. ఇక్కడ EHV కాదు. 3HV. Head, Hand and Heart యీ 3HV చాలా అవసరము. తలతో మనము విచారించిన దానిని, హృదయముతో పరిశీలన సల్పి, చేతితో మనము క్రియ ప్రారంభించాలి. దీనినే వేదాంతము 'త్రికరణశుద్ధి' అని పేరు పెట్టింది.

**భావనాశక్తిని, ఇచ్ఛాశక్తిని చక్కగా అర్థం చేసుకోవాలి**

ఇలాంటి త్రికరణ శుద్ధితో వుండిన భావములు రెండు వుంటున్నాయి. ఒకటి క్రియా భావము, రెండవది శాస్త్రభావము. ఈ క్రియాభావమనేదే చాలా అధికమైన శక్తిలో వుంటున్నది. Artistic sense and scientific sense. Scientific senseకంటే artistic sense చాలా అధికముగా వుంటుంది. ఈ sense కి చాలా ప్రధానమైన విలువ యివ్వాలి. దీనినే భావము అన్నారు. ఈ భావమునకు యిచ్ఛాశక్తి చేరాలి. దీనికి చక్కని ఉదాహరణ. ఒక పెద్ద శిల వుంటున్నది. ఒక శిల్పి ఆ శిలనుండి సుందరమైన విగ్రహము తయారు చెయ్యాలి.

sri sathyasai vachanamrutam

కానీ, సుందరమైన శిల్పము ఆ శిలలో వున్నదా? లేదు. తన భావమునందున్నది. ఈ భావాన్ని ఆ శిలపైన యిమిడ్చి అనగా యిచ్ఛాశక్తితో ఆ రూపాన్ని శిలనుండి బయటకు తీస్తున్నాడు, శిల్పి. భావమే శూన్యమైతే యీ సుందర విగ్రహమే తయారుకాదు. కనుకనే 'యద్భావం తద్భవతి'. భావము అత్యవసరము. ఈ భావనాశక్తిని, యిచ్ఛాశక్తిని చక్కగా అర్థము చేసుకోటం అత్యవసరము. ఈ రెండింటియొక్క సమ్మిళితమైన ప్రజ్ఞను అనుభవించాలి.

**మానవత్వములో ఉన్న సమత్వమును అర్థము చేసుకోవాలి**

ఈనాడు మానవుడు కేవలము భౌతికమైన పరిశోధనలయందే తన కాలమును వ్యర్థము గావించుచున్నాడు. ఈ పరిశోధనా శక్తి అనేది కేవలము objectకే పరిమితమైనది. కానీ పరిశోధనకు ఆధారమైనది ఒకటున్నది. దీనినే అంతర్దృష్టి అన్నారు. ఈ science ప్రపంచమునకు అత్యవసరమే! కాని, ఆధారమును వదలి ఆధేయముకోసమే ఆశించటముచేత యిది అనేక విధములైన అశాంతిని కలిగిస్తూ వుంటుంది. విజ్ఞానమనేది మానవుని మేధస్సుకు మితిమీరిన భాగాన్ని అందింపచేస్తున్నాది. ఈ scienceకు ఆత్మ భావముకానీ, మనో విశ్వాసముగానీ వుండదు. పవిత్రమనే దానిని యేమాత్రము చింతించదు. మానసిక వికాసము, ఆత్మ విచారము లేకపోవటంచేత సైన్సు ప్రమాదకరమైనదని అనిపిస్తున్నది. ఈ సైన్సు ప్రపంచమును స్వర్గముగా మార్చగలదనే విశ్వాసము అందరియందు నెలకొన్నది. కాని, యిది అసాధ్యము. స్వర్గమంటే యేమిటి? లౌకిక భోగములు అనుభవించటము స్వర్గమా? ఇదే మానవత్వాన్ని ధ్వంసము చేస్తున్నది. మానవునియందు వున్న విలువనంతాకూడను మరుగు పరుస్తున్నది. నిరంతరము పరిశోధనా లక్ష్యమే మానవుని పరమావధిగా రూపొందుతూ వస్తున్నది. ఈనాడు విజ్ఞానశాస్త్రము ప్రతి ప్రశ్నకు ఒక answer అందిస్తూనే వుంటున్నది. కానీ యివన్నీకూడను సరైన answersగా లేవు. ఇది క్రమక్రమేణా అశాంతికి మూలకారణంగా రూపొందుతూ వచ్చింది. ఈ శాంతిని మనము అనుభవించాలని అనుకున్నప్పుడు, సైన్సును మనము సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టాలి. దీనికి ఐకమత్యము చాలా అవసరము. సామూహిక కృషియే మన జీవితమునకు ఆధారము. మానవత్వములో వున్న సమత్వాన్ని మనము

srisathyasaivachanamrutam

కొంతవరకు అర్థము చేసుకోవాలి. సమత్వ భావములను అభివృద్ధి పరచుకోవాలి.

## Integration అనేది మన జీవితములో ఒక భాగముగా నిలచిపోవాలి

కానీ యీనాడు ప్రాపంచికమైన ఐకమత్యము అత్యవసరమని అందరుకూడను బోధిస్తూనే వుంటున్నారు. అయితే ప్రపంచముయొక్క unity కంటే మొట్టమొదట గృహముయొక్క unity అత్యవసరము. ఈ గృహముయొక్క unity అభివృద్ధి పరచుకున్నప్పుడే క్రమక్రమేణా గ్రామమునందు unity అభివృద్ధి గాంచగలదు. National Integration అని చెబుతున్నాము. National Integration అన్న దాంట్లో యేమి అర్థము? ఏ చైనావారో, పాకీస్తాన్‌వారో దేశముపైన పడినప్పుడు National Integration అంటున్నాము. ఆ సమయము దాటిపోగానే ఆ Integration ఏమైపోతుందో? అదికాదు, Integration అనేది. మన జీవితములో ఒక భాగముగా నిలచిపోవాలి. ఇది మానవతా విలువగా మనము భావించాలి.

## స్వార్థ, స్వప్రయోజనములకు స్వస్తి చెప్పి ఏకత్వమును స్వాగతించాలి

దివ్యత్వమును ఆత్మతత్త్వముగా మనము విశ్వసించాలి. అనేకత్వములో వున్న యేకత్వముగా భావించాలి. ఈ unity in diversity అనేది మనము చక్కగా గుర్తించాలి.

**Stars are many but sky is one**
**Bodies are many but life is one**
**Beings are many but breath is one**
**Nations are many but World is one**
**Religions are many but truth is one**

ఇదే నిజమైన ఐకమత్యము. కనుక ఐకమత్యమనే దానిని మనము హృదయపూర్వకముగా అనుభవించటానికి ప్రయత్నము చేయాలి. విజ్ఞానము అత్యవసరము. ఈ విజ్ఞానమునందున్న ప్రజ్ఞానముకూడా మనము విచారణ చెయ్యాలి. ఈ ప్రపంచమునందున్న సుజ్ఞానముకూడను విచారణ చెయ్యాలి. విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానముల సమ్మిళితమైన స్వరూపమే మానవత్వము. ఈ మూడింటియందు యేకత్వాన్ని

sri sathyasai vachanamrutam

పొందటమే నిజమైన ప్రజ్ఞయొక్క తత్త్వము. ఇలాంటి విద్యను మనము యీనాడు అభ్యసించాలి. నిరంతరము మనము అతి జాగ్రత్తగా మెలగాలి. దీనినే ABC of Life అన్నారు. A-always, B-be, C-careful. Always Be Careful అని దీనియొక్క అర్థము. ఇది మన నిజమైన చదువు. ఈ నిజమైన తత్త్వాన్ని మనము అలక్ష్యపరచి carelessగా జీవిస్తున్నాము.

జీవితము చాలా పవిత్రమైనది. పవిత్రము అనేది Latin భాషనుండి వచ్చినది. ఇది విర్ అనే దానినుండి పుట్టినది. విర్ అనగా మానవుడు. కనుక మానవుడు పవిత్రుడని దీని అర్థము. పవిత్రమైన మానవుడు చేయు ప్రతి పనికూడను పవిత్రమైనదిగానే వుండాలి. మానవునియొక్క సర్వసంకల్పములు పవిత్రముగానే వుండాలి. కానీ యిలాంటి పవిత్రత యీనాడు కనుమరుగై పోయింది. పవిత్రత యీనాడు యెక్కడ కనుపించటంలేదు. స్వార్థ స్వప్రయోజనములకు స్వస్తి చెప్పి, విశిష్ఠమైన unityని మనము స్వాగతము చెయ్యాలి. ఈనాడు విద్యార్థులు నిత్యజీవితమునకు అవసరమైన విద్యలో యేమాత్రముకూడను అభివృద్ధి గాంచటంలేదు. విషయాన్ని క్రోడీకరింపచేసుకొనే నిమిత్తమై విద్యనభ్యసిస్తున్నారేకాని ఆత్మప్రబోధ నిమిత్తమై విద్య అనే సత్యాన్ని గుర్తించటంలేదు. కాదుకాదు. విద్య మనయొక్క జీవితాధారము. కనుకనే యీ ప్రజ్ఞాతత్త్వమును చక్కగా గుర్తించి యీ ప్రజ్ఞయందు ఆవిర్భవించిన సత్యధర్మశాంతిప్రేమలను హృదయపూర్వకముగా విశ్వసించి, ఆచరణలో పెట్టినప్పుడే దీనియొక్క ఆనందము లభ్యమౌతుంది.

**మానవతా విలువలు ఆచరణద్వారానే అభివృద్ధిపరచుకోవాలి**

మానవతా విలువలు గ్రంథములలో అభ్యసించేవికావు. కేవలము బోధనచే మనకు ప్రాప్తించేవికావు. స్వశక్తితో తన ఆచరణయందే దీనిని అభివృద్ధి పరచుకోవాలి. ఈనాడు ఉపన్యాసాలతో మనిషి ప్రవర్తనలో పరివర్తన జరుగుతుందనేది సరికాదు. మానవునియొక్క ప్రవర్తన అత్యవసరము. మానవుడనగా మనసే! మనసనగా సంకల్పములే! సంకల్పములనగా నిత్యజీవితములో వుండిన పరిణామమమే! ఈ పరిణామమునకు ప్రవర్తనే

sri sathyasai vahanamrutam

ఆధారము. యీనాడు ప్రపంచము వుండవలసిన రీతిగా వుండలేదంటే దీనికి సరియైన ప్రవర్తన లేకపోవటమే కారణము. మానవుడు వుండవలసిన రీతిగా వుండటంలేదు. కనుక, ప్రవర్తనను మార్చుకున్నప్పుడే అందులో సరియైన విలువలను, ఆనందమును మనము అనుభవించవచ్చును.

విద్యార్థులారా! ముఖ్యముగా మీరు హృదయాన్ని పరివర్తన చేసుకోవాలి. మీ సమస్త కర్మలుకూడను పవిత్రమైన కర్మలుగా రూపొందింప చేసుకోవాలి. మీ మాటలు, మీ నడతకూడను పవిత్రమైనవిగా వుండాలి. దీనితో అభ్యసించే విద్యనే సరైన విద్య. ఈ విద్యయందు వినయము చాలా అత్యవసరము. వినయాన్ని పెంచుకోటమే మానవుని ప్రధాన కర్తవ్యము. ఈ విధమైన పవిత్రతను మనము పెంచుకున్నప్పుడే నిత్యసత్యమైన స్థానాన్ని మనము సులభముగా అందుకోవచ్చు. మొట్టమొదట మన శరీరాన్ని వంచాలి. ఇంద్రియాల్ని నిగ్రహించుకోవాలి. మనోనాశము చేయాలి. అప్పుడే మనకు సరైన స్థానము లభ్యమవుతుంది. అప్పుడే మనము నిజమైన ఆనందమును పొందవచ్చు. కనుక Bend the body, mend the senses, end the mind. This is the way to attain Immortality. మనకు Immortality కావాలంటే మనము Immorality నిర్మూలము చెయ్యాలి. What is the way to Immortality? Removal of immorality is the only way to immortality. విద్యార్థులు అతి జాగ్రత్తగా వుంటుండి జీవితములోపల దీనిని అభివృద్ధి చెయ్యాలి. యితరులకు అందించాలి. అప్పుడే ఆదర్శప్రాయమైన విద్యను అభ్యసించినవారవుతారు.

**ఆచరణద్వారానే ప్రచార, ప్రబోధములు అధికమవుతాయి**

విద్యార్థులే కాకుండా అధ్యాపకులుకూడను యీ సత్యాన్ని గుర్తించి ఒకరికి ఒకరు సన్నిహిత సంబంధబాంధవ్యమును పెంచుకోవాలి. నిజముగా మానవతా విలువలనేవి నేర్చుకొనేవికాదు. అవి సహజమైన శక్తులు. కేవలము విద్యార్థులకేకాదు, జగత్తునందు వుద్భవించిన ప్రతి మానవునికి యీ మానవతా విలువలు అత్యవసరము. ఏ విధముగా యితరులు మనలను గౌరవించాలని ఆశిస్తున్నామో ఆ విధముగా మనము యితరులను మొట్టమొదట గౌరవించాలి. కాని, యితరులు మనలను గౌరవించాలని ఆశిస్తున్నామేగాని

sri sathyasaivachanamrutam

మనము యితరులను గౌరవించటములేదు. యిది one way traffic కాకూడదు. Give and take, give and take. ఇతరులు యే విధముగా వుంటుంటే మనము మంచిదని భావిస్తామో ఆ మంచిని మనలో అభివృద్ధి పరచుకోవాలి. యితరులకు చెప్పుటకు పూర్వము మొట్టమొదట మనము దానిని ఆచరించాలి. ఆచరణ ద్వారానే ప్రచార, ప్రబోధములు అధికమవుతాయి. ఆచరణలో లేక కేవలము ప్రబోధలు చేసినంత మాత్రమున యిది కేవలము హాస్యాస్పదము అవుతుంది. కనుక, మనము యే ఒక్కటి రెండైనా ఆచరించి యితరులకు ఆదర్శముగా అందించుటకు కృషి చెయ్యాలి. ఈ ఆదర్శాన్ని మనము ముఖ్యముగా దృష్టియందు వుంచుకోవాలి. ఈ విద్యార్థులయందిది అభివృద్ధి గాంచినప్పుడు క్రమక్రమేణా విశ్వమంతా యిది ఆదర్శముగా నిరూపించటానికి అవకాశమవుతుంది.

## విద్య జీవనోపాధి నిమిత్తము కాదు, జీవిత పరమావధికొరకు

చదువులు కేవలము జీవనోపాధి నిమిత్తముకాదు. జీవిత పరమావధి అనే సత్యాన్నికూడ గుర్తించాలి. Education should be for life not for living. ఈ సత్యాన్ని మనము చక్కగా చింతించాలి. ఈనాడు విద్యావిధానమునందు మొట్టమొదట మనము గుర్తించవలసినవి రెండు–'నేను మానవుడు' అనే దానిని విశ్వసించాలి. ఇది కేవలము half truth. ఇంకొక half truth ఉంది, అది యేమిటి? 'నేను పశువునుకాదు', అనేది. I am not animal అనేది half truth. I am human అనేది మరొక half truth. ఈ రెండు చేరినప్పుడే మానవత్వము పూర్ణమవుతుంది. నేను మానవుడు, మానవుడు అని చెప్పుకుంటూ animal గా ప్రవర్తిస్తూంటే మానవుడు యెట్లా కాగలడు? కనుక మనలో చేరిన పశుత్వాన్ని దూరము చెయ్యాలి. ఆ పశుత్వాన్ని దూరము చేయక యెంతకాలము యెన్ని చదువులు చదివినప్పటికి ప్రయోజనములేదు.

## ప్రతి వ్యక్తినుండి నేర్చుకోవలసినవి ఎన్నో ఉంటాయి

Educationలో ప్రధానమైన subjects రెండు–commonsense ఒకటి, general knowledge రెండవది. ఈ commonsense, general knowledge లేనప్పుడు యెంతటి వైజ్ఞానికుడైనప్పటికి కొంత అశాంతికి గురికావచ్చు. పూర్ణజ్ఞాని పూర్ణానందముగా

sri sathyasai vachanamrutam

వుంటాడు. ఒక చిన్న ఉదాహరణము. భూమికి ఆకర్షణశక్తి కలదని కనిపెట్టినవాడు, న్యూటన్. యితడు గొప్ప సైంటిస్టు. చాలా ఉత్తముడు. నిరంతరము తన పరిశోధనలంతాకూడను ఒకే angleలో జరుగుతూ వుండేవి. లేబరేటరీలో కూర్చొని అదే తన లోకముగా భావించుకొనేటువంటివాడు. ఈ ప్రపంచమునకు సంబంధించిన విషయాలలో అతనికి యేమాత్రము పరిచయములేదు. ఈ విధంగా వైజ్ఞానికమనేది కేవలము ఒకే angle లో పోతే ప్రయోజనములేదు. Awareness is life. అన్నింటిని తాను గుర్తించాలి. అలా చేయకపోవటంవలన కొన్ని ప్రమాదములుకూడను సంభవిస్తాయి. న్యూటన్ ఒక పిల్లిని అతి ప్రీతిగా పెంచుకొనేవాడు. ఆ పిల్లితో ఆయన చాలా సంబంధం పెంచుకున్నాడు. అతను రూమ్‌లో పోయి యేదో పరిశోధన విషయం గురించి ఆలోచించే సమయములో యీ పిల్లి తలుపువద్దకు వచ్చి మ్యావ్ మ్యావ్ మని అరచేది. పిల్లి అరచటంచేత తనకి కొంత distrubanceగా వుంటుందని చెప్పి దానిని అరచనీయకుండా వుంచేందుకై తలుపుకి ఒక చిన్న రంధ్రాన్ని పెట్టించాడు. దానికి అవసరమైనప్పుడు ఆ రంధ్రముగుండా దూరటం, రూమ్‌లోకి రావటం జరిగేది. యిక అరచటం మానివేసింది. ఇతనికి చాలావరకు తృప్తి కల్గింది. కొన్ని దినములైన తరువాత ఆ పిల్లికి రెండు పిల్లలు పుట్టాయి. తలుపుకు పిల్లి రావటానికి ఒకే రంధ్రము వుంది, ఇంక రెండు పిల్లలు రావటానికని, carpenter పిలిపించి యింకో రెండు రంధ్రములు చేయించాలనుకున్నాడు. Carpenter వచ్చాడు. ఎక్కడ రంధ్రములు పెట్టాలిసార్, దేనికోసం పెట్టాలి? అని ప్రశ్నించాడు. ఇంతకు ముందు ఒక పిల్లి పెద్దది వుండేది. ఇప్పుడు దానికి రెండు పిల్లలు పుట్టాయి. కాబట్టి మరొక రెండు రంధ్రాలు పెట్టమన్నాడు. అప్పుడు carpenter చెప్పాడు "సార్! వుండే రంధ్రములోనే మూడు రావచ్చుకదా ఒకటి తర్వాత, ఒకటి" అన్నాడు. అప్పుడు న్యూటన్ అనుకున్నాడు, "ఛీ! వాడికి వున్న బ్రెయిన్‌కూడా నాకు లేకపోయిందే! అతనికి వున్న general knowledge నాకు లేకపోయిందే! అని. అతనినుండి గొప్ప పాఠాన్ని నేర్చుకున్నట్లుగా విశ్వసించాడు. కనుక, మనం నేర్చుకోటమంటే, కేవలం గొప్పవారి నుండేకాదు, ప్రతివ్యక్తినుండి నేర్చుకోవలసినవి యెన్నో వుంటున్నాయి.

srisathyasaivachanamrutam

## మానవతా విలువలు పోషించుకోవటమే నిజమైన మానవత్వము

ఈనాడు విద్య అధికమైనకొలది 'నేను గొప్ప విద్యావంతుడను' అని అహంకారముగా వుంటుంటారు. అది చాలా పొరపాటు. మనయొక్క చదువు Mathematics, దాని తర్వాత Physics, తర్వాత Chemistry, తర్వాత Biology, యింతటితోనే నిలచిపోతున్నాది. కాని, Theology వరకు పోవటంలేదు. దైవత్వాన్ని మనం పొందాలి. కేవలము పదార్థమునుండి వృక్షము, వృక్షమునుండి మానవునివరకు పోయి నిలిపివేస్తున్నారు. అక్కడినుండి దైవత్వాన్ని చేరటానికి పూనుకోవాలి. అదే నిజమైన చదువు. మానవుని మానవునిగా చిత్రించటము గొప్పతనముకాదు. మానవుని ఆదర్శవంతమైన మానవునిగా, ఉత్తమ మానవునిగా రూపొందించుకోవాలి. ఈనాడు అనేక సిద్ధాంతములు మనము కనిపెట్టాము. అనేక పరిశోధనలు చేసి ఎన్నో విషయములు తెలుసుకున్నాము. గొప్ప విజ్ఞానవేత్తగా తయారైనాము. కాని మానవతావిలువలు ఎంతవరకు సంపాయించుకున్నారు? మానవత్వాన్ని యెంతవరకు రక్షించుకున్నారు? ఈ questionకి answer లేదు. దీనికి answer మనము సంపాయించుకోవాలి. మానవతావిలువలు పోషించుకోటమే నిజమైన మానవత్వానికి అర్థము.

యీనాడు విద్యాసంస్థలయందు మానవతావిలువలు తప్పనిసరిగా ఒక స్పెషల్ సబ్జక్టుగా పెట్టాలి. ఈ Human Values అనేది లేకపోవటంచేతనే యీనాటి విద్యావంతులంతా కేవలం రాక్షసులవలె ప్రవర్తిస్తున్నారు. నిరర్థకమైన జీవితము పూర్తిగా వ్యర్థమే! మానవత్వంలో వుండే దివ్యత్వాన్ని మనం గుర్తించటానికి ప్రయత్నం చేయాలి.

ఈనాడు ఇక్కడ అనేక విశ్వవిద్యాలయముల ఉపకులపతులు చేరివుంటున్నారు. వీరందరుకూడను యీ విధమైన నిర్ణయాన్ని చక్కగా సహృదయంతో స్వీకరించి అమలుపరచినప్పుడు మనము ఎంతో అభివృద్ధి సాధించినవారమవుతాము. గొప్ప గొప్ప విద్యావంతులు మన భారతదేశములో యెంతోమంది వుంటున్నారు. ఇలాంటి వారందరు చేరి యీయొక్క ఆదర్శవంతమైన మానవత్వాన్ని పోషించటానికి ఒక సొసైటీని స్టార్ట్ చెయ్యాలి. ఈ సంస్థ ప్రభుత్వానికి సంబంధంలేకుండా వుండాలి. ఈ ప్రభుత్వముతో

sri sathyasai vachanamrutam

సంబంధముగా వున్నప్పుడు మన భావములు, మన వుద్దేశ్యములు, మన ఆశయములు యేమాత్రము ఫలించలేవు. నిజానికి, విద్యాసంస్థలే ఒక ప్రత్యేకమైన సొసైటీగా వుండాలి. అప్పుడే యీ ఆశయాన్ని చక్కగా అభివృద్ధి గావించవచ్చు. యివి ప్రత్యేకమైన, స్వతంత్రమైన సంస్థలుగా తయారుకావాలి. ఈ విధముగా చేసినప్పుడే మన ఆశయాలు, మన సిద్ధాంతాలు, మన పవిత్రతను యెంతైన మనము ఆచరణలో పెట్టి ప్రచారం చేయటానికి అవకాశం వుంటుంది. విద్యావంతులకు చాలా గొప్ప గొప్ప భావాలుంటున్నాయి. కానీ, వారికి స్వతంత్రము లేకపోయింది. వారికి తగినంత స్వతంత్రమునందించాలి. ఈ ఉపకులపతులందరుకూడను యిటువంటి స్వతంత్రమును కోరాలి. Responsibilityని మాత్రం యిస్తున్నారే గాని Rights యివ్వటంలేదు. ఈ Rights and Responsibilities రెండు వుంటున్నప్పుడే light and shadow మాదిరి రెండు వుంటుంటాయి. Light యెక్కడవుందో అక్కడ shadow వుంటుంది. Shadow యెక్కడవుందో అక్కడ light వుంటుంది. ఈ విధమైన Rights and Responsibilities తీసుకున్నప్పుడే మనము యీయొక్క మానవతావిలువలను యెంతైనా పోషించవచ్చును. ఈ విధమైన భావాలతో, ఐకమత్యముతో మానవతా విలువలు పోషించినప్పుడు భారతదేశము యెంతైనా ఆదర్శవంతమైన దేశముగా రూపొందుతుంది. ప్రతివ్యక్తి యిది నా స్వంత పని అనే వుద్దేశ్యము అభివృద్ధి చేసుకోవాలి. దేశముయొక్క ప్రగతిని మనము దృష్టిలో పెట్టుకోవాలి. కేవలము 'నాది, నా వారు' అనే వరకే ప్రయాణము కాకూడదు. 'మనది, మనవారు' అనే వుద్దేశ్యము పెరగాలి. ఈ విధమైన ఐకమత్యత, పవిత్రత, దివ్యత్వములను ఆత్మతత్త్వముతో సమ్మేళనము చేసినప్పుడే మనం తప్పక మానవతా విలువలను పోషించగలము.

**విశాలభావమును పెంపొందించుకొనుటే విద్యయొక్క లక్ష్యము**

ఆత్మవిచారణ, మనోవికాసము యీ రెండును అత్యవసరము. ఈ మానసిక వికాసాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. యీనాడు చదువులు అధికమైపోతున్నాయి గాని, మనసు చాలా నేరో అయిపోతున్నాది. సంకుచిత మనస్సుగా తయారౌతోంది. కాదు, కాదు; విశాలమైన భావాన్ని పెంచుకోవాలి. ఇదే నిజమైన విద్యయొక్క సారము. విద్యయొక్క లక్ష్యము. యీ లక్ష్యాన్ని మనము చేరాలి.

sri sathyasai vahamrutam

**పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి**
**పట్టు నెగ్గెడిదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక పోవకుండు**
**అడిగినదేదియో అడగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడవకుండు**

ఈ పట్టుదల మానవునిలో వుంటుండాలి. ఇలాంటి పవిత్రమైన విషయాలలో పట్టుదల మనకు అత్యవసరము. ఇది నా కోసముకాదు, ప్రపంచ నిమిత్తమై చేసేది. 'దేశమంతా క్షేమంగా వున్నప్పుడే నేనుకూడా క్షేమంగా ఉండగలను' అనే భావము పెంపొందాలి. నా ఆనందము, నా సుఖమే ప్రధానమనుకుంటే యేమాత్రము ప్రయోజనములేదు. కనుక, దేశక్షేమాన్ని మనము లక్ష్యములో పెట్టుకోవాలి. పవిత్రమైన భారతదేశముయొక్క విశిష్టతను మనము పెంచుకోవాలి.

## ఆధ్యాత్మిక భావమే జీవితమునకు ఆధారము, గమ్యము

భౌతికముతోపాటు ఆధ్యాత్మికముకూడను జోడించాలి. ఈ రెండింటిని negative, positiveల మాదిరి మనము చేర్చుకోవాలి. ఈ రెండు చేరినప్పుడే సరియైన ఆనందము మనకు లభిస్తుంది. సైన్సు ప్రత్యేకము, ఆధ్యాత్మికము ప్రత్యేకము అని మనము విభజించరాదు. ఈ రెండింటిని యేకము చేసుకోవాలి. మనమందరము ఐకమత్యముగా వుంటుండాలి. సత్సంగాన్ని పెంచుకోవాలి. సత్సంగముచేతనే సద్భావాలు పెరుగుతూ వుంటాయి. ఈ సద్భావములచేతనే సత్కర్మలు ఆచరించుటకు వీలవుతుంది. కనుకనే యీనాడు మనకు సత్సంగము చాలా అవసరము. కాని దురదృష్టవశాత్తు యెక్కడికి పోయినప్పటికి దుస్సంగము, దుస్సంగము, దుస్సంగమే! ఐన్‌స్టీన్‌కూడను అనేక పర్యాయములు చెప్పాడు. Tell me your company I shall tell you what you are అని. నీ సంఘమును బట్టి నీవు వుంటుంటావు. ఈనాడు దుస్సంగాన్ని సులభముగా మనము పెంచుకుంటున్నాము. దుర్భావములను సులభముగా పెంచుకుంటున్నాము. దురుద్దేశాన్ని సులభముగా

పెంచుకుంటున్నాము. సద్భావాన్ని, సదుద్దేశాన్ని మనము యేమాత్రము పెంచుకొనుటకు ప్రయత్నించుటలేదు. ఈ bad habits అనేవి క్షణములో మనకు ఆవరించి పోతున్నాయి. కాని పవిత్రమైన భావములు యెంత ప్రయత్నించినా రాలేకపోతున్నాయి. కారణమేమిటి? నీ సంకల్పము పటుత్వమైనదిగా లేకపోవటమే! ఈనాడు సైన్సుకు మానవుని జీవితముయొక్క సమగ్రతను పెంచే సామర్థ్యములేదు. ఒక్క ఆధ్యాత్మికమునకు మాత్రమే యీ సమగ్రతను పోషించే అధికారముంటున్నాది. కనుకనే మొట్టమొదట మానవతావిలువలు అత్యవసరము. విత్తనములు భూమిలో పెట్టి నీరుపోసినప్పుడే మొలకెత్తుతాయి గాని tinలో పెట్టి నీరు పోస్తే కుళ్ళిపోతాయి. అదే విధముగనే మానవతావిలువలు ఆధ్యాత్మికములో పెట్టినప్పుడే అవి అభివృద్ధి కాగలవుగానీ కేవలము సైన్సులోనే పెడితే యేమాత్రము అభివృద్ధి కావు. కనుక, మానవతావిలువలు పెరగటానికి ఆధ్యాత్మికమనే సాయము చాలా అవసరము. ఆ ఆధ్యాత్మిక సహాయం లేకపోతే Human Values, artificial valuesగా మారిపోతాయి. ఈ artificial వల్ల ప్రయోజనములేదు. Art is outside. Heart is inside. కనుక heartలో మానవతా విలువలు అభివృద్ధి కావాలి. కనుక, మొట్టమొదట ఆధ్యాత్మిక భావాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. అదే మనకు ఆధారము. అదే జీవితమునకు గమ్యము.

**దుష్టభావములను వీడుటే నిజమైన వైరాగ్యము**

Fatherhood of God and brotherhood of man, అన్నారు. ఈ రెండింటిని develop చెయ్యాలి. భక్తి అన్నిటికి మించి అత్యవసరము. ఈ devotion లేకుండా పోతే కేవలం ocean లో మునిగిపోతాము, మనము. మన సంసారము అనేటువంటిది యే విధముగా వుంటునాన్నదంటే, సముద్రాన్ని మధనము చేసినప్పుడు మొట్టమొదట హాలాహాలము పుట్టింది. తరువాతనే అమృతము వచ్చింది. ఆ విధముగనే మన జీవితము అనే దానిని చక్కగా మధిస్తే వైరాగ్యము అనేది మొట్టమొదట పుట్టాలి. తరువాతనే ఆనందమనేది లభ్యమవుతుంది. వైరాగ్యము లేకుండా ఆనందము మనకు రాదు. కనుక మొదట వైరాగ్యము మనము అభివృద్ధి పరచుకోవాలి. Deattachment అంటే యేమిటి? ఇల్లు, వాకిలి, ఆలుబిడ్డలు వదలి అరణ్యమునకు పోటంకాదు. దుష్టభావాన్ని విసర్జించటమే

srisathyasaivachanamrutam

వైరాగ్యము. అదే నిజమైన వైరాగ్యము. ఆ విధమైన భావాన్ని విద్యార్థులు పెంచుకొని, సమరసమును, సమత్వమును అభివృద్ధి గావించుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

విద్యార్థులారా! మానవత్వాన్ని అభివృద్ధి చేయలేని విద్య కేవలం శ్మశానములో వున్న నక్కల అరుపులవంటిదే! మొట్టమొదట మనము character develop చేసుకోవాలి. అందువలననే character is the hallmark of man అని అన్నారు. ఈ పవిత్రతను మనము పెంచుకోవాలి. అది పవిత్రమైన నడతలలోనే మనకు వస్తుంది. మన సంస్థయందు వుండిన విద్యార్థులు కొన్ని రకములైన అభ్యాసములు అభివృద్ధి చేసినప్పుడు యావత్ ప్రపంచానికి వీరివల్ల ఆదర్శమును నిరూపించవచ్చు.

కనుక విద్యార్థులారా! మీ స్వార్థాన్ని స్వప్రయోజనాన్ని కొంతవరకు త్యాగము చేసి సమాజమునకు తోడునీడగా వుండే కర్మలు మీరు చేబట్టాలి. ఈనాడు అనేకమంది గొప్ప గొప్ప ఉపకులపతులు ఇక్కడ చేరారు. వీరందరు యీ మూడు దినములు ఈ సమావేశములో చర్చించి సరైన నిర్ణయం తీసుకుని ప్రపంచానికి చాటటానికి సంసిద్ధులుగా వుంటున్నారు. ఈ అవకాశమును మీరు సద్వినియోగము చేసుకోండి, ఈ పవిత్రతను మీరు అందుకోండి, ఈ పెద్దల వాక్యములను మీరు చక్కగా ఆలకించండి. ఈ సమావేశములంతా కేవలము కాలము వృథము గావించుకొనే నిమిత్తము యేర్పడినటువంటివికాదు. ఈ seminar యొక్క essenceను యావత్ ప్రపంచానికి అందించటానికి మీరు messengersగా వుంటుండాలి. ఈ seminar కేవలము మూడు దినములు ముచ్చటగా కాలాన్ని గడుపుకోటంకోసం ఏర్పాటు చేయబడలేదు. ఆ గొప్ప గొప్పవారి గొప్ప గొప్ప భావాల్నంతా యిందులో యిమిడ్చి దీనిని పరిశుద్ధమైన, పవిత్రమైన రూపాలుగా తయారుచేస్తున్నారు. యీ సదవకాశమును పురస్కరించుకుని పవిత్రతను మీరు అభివృద్ధి పరచుకొని ఐకమత్యముచేత యావత్ భారతదేశము, సమాజముయొక్క గౌరవాన్ని కాపాడాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ విరమిస్తున్నాను.

**(తేదీ 24-09-1987నఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam